క్లుప్తంగా

రూ.10.10 లక్షల పరిహారం పంపిణీ



తెనాలి: వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ217ఏ జిల్లా గవర్నర్ గోనుగుంట్ల జయంత్‌కుమార్ క్లబ్ సభ్యుల పరిహారం రూ.10.10లక్షల చెక్కులను మంగళవారం సంబంధిత నామినీలకు పంపిణీ చేశారు. క్లబ్ సభ్యుల నామినీలు తూనుగుట్ల వెంకట శ్రీధర్‌కు రూ.3,05,800, అరుణ్‌కుమార్‌కు రూ.1.02లక్షలు, మానసకు రూ.3.07 లక్షలు, నరేంద్రకు రూ.3,00,600 పరిహారం అందజేశారు. 2013 ఆగస్టులో ప్రవేశ పెట్టిన పథకం ద్వారా ఇప్పటికి 900 లబ్ధిదారులకు రూ.35 కోట్లను అందజేసినట్లు వివరించారు. వైస్ ప్రెసిడెంట్ మాడా వెంకటసుబ్బారావు, గొడవర్తి మల్లికార్జునరావు, పులిపాటి సుధాకర మూర్తి, చుండూరు రామమోహనరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏపీపీగా మోహన్‌రెడ్డి



తెనాలి రూరల్: తెనాలిలో నూతనంగా ఏర్పాటు చేసిన పోక్సో కోర్టు ఇన్‌చార్జి అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది దాట్ల మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ ఉత్తర్వులు మంగళవారం జారీచేశారు. మోహన్‌రెడ్డి ప్రస్తుతం 11వ అదనపు జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మోహన్‌రెడ్డి నియామకంపై బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

ముగిసిన ఎగ్జిబిషన్



తెనాలిఅర్బన్: జేఎంజే మహిళా కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్ట్స్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్ మంగళవారంతో ముగిసింది. ఎగ్జిబిషన్‌లో ఉంచిన పలు నమూనాలను పట్టణంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిశీలించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన నమూనాలలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి, బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల అధ్యాపకులు రాయపాటి శివనాగేశ్వరరావు, ప్రొఫెసర్ జి.మోహనాచార్యులు, జేఎంజే గ్లోబల్ స్కూల్ ఉపాధ్యాయులు మోక్షిత, ఆప్రీయ, మోక్షిత్, కరస్పాండెంట్ సిస్టర్ థెరిస్సా, ప్రిన్సిపల్ షైనీ, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ శారద, ఎగ్జిబిషన్ కమిటీ కన్వీనర్ ఎం.రమణ, పలువురు అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ్రమ నిర్మాణానికి రూ.50వేల విరాళం



తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ సేవా శాంతి ఆశ్రమ నిర్మాణానికి విశ్రాంత రైల్వే ఉద్యోగి వాడపల్లి రామకోటేశ్వరరావు రూ.50 వేల నగదును విరాళంగా అందజేశారు. మంగళవారం ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారికి నగదును రామకోటేశ్వరరావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు ఆశ్రమంలో అందిస్తున్న సేవలు సంతోషదాయకమన్నారు. తొలుతగా ఆశ్రమంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వాడపల్లి భరద్వాజ్, యోగచార్య పి.కుటుంబరావు, వై.కోటేశ్వరరావు, ఎల్.రవి, వి.నాగభూషణం, రాజు పాల్గొన్నారు.

భారత సినిమా ప్రతిభకు పట్టం ఆస్కార్



తెనాలిఅర్బన్: భారత సినిమా ప్రతిభకు పట్టాభిషేకం ఆస్కార్ అని, మా ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా పేర్కొన్నారు. తెనాలి సుల్తానాబాద్‌లోని రత్నా ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మా ఏపీ.. తరపున దర్శకుడు రాజమౌళితో సంప్రదించి హైదరాబాద్‌లో అభినందన సభ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. నాటు-నాటు పాట రచయిత చంద్రబోస్, స్వరకర్త కీరవాణి, కొరియోగ్రాఫర్ ప్రేమ రక్షిత్, దర్శకుడు రాజమౌళి, ఇతర సాంకేతిక నిపుణులకు ఆర్ఆర్ఆర్ సినిమా నటినటులకు సాంకేతిక నిపుణులకు ఆయన అభినందనలు తెలియజేశారు. నటుడు మిలటరీ ప్రసాద్, సాయి జితేష్, పినపాటి సురేష్‌బాబు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ‘అల్బెండజోల్’ మాత్రల పంపిణీ



విద్యార్థినికి మాత్రలు వేస్తున్న ఎంపీపీ పద్మావతి, డాక్టరు లక్ష్మీసుధ

కొల్లిపర: నులిపురుగులు చిన్నారుల అనారోగ్యాలకు కారణమవుతాయని, తల్లిదండ్రులు ఆరు నెలలకోసారి తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్ర వేయాలని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మంగళవారం జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మున్నంగి పీహెచ్‌సీ వైద్యులు లక్ష్మీ సుధ మాట్లాడుతూ నులి పురుగులు మనిషి పేగులలో చేరి రక్తాన్ని పీల్చి.. రక్తహీనతకు కారణమవుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, భీమవరపు సంజీవరెడ్డి, పిల్లి గంగాధర్, ఏఎన్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరు పీహెచ్‌సీ పరిధిలో...

తెనాలిటౌన్: మండలంలోని కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని గ్రామాల్లో మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొలకలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ దిలీప్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సూపర్‌వైజర్ జి.శ్రీనివాసరావు విద్యార్థులకు నులి పురుగులపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్ర వేయడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.శోభాదేవి, హెచ్‌ఈఓ నాగరాజు, సూపర్‌వైజర్ లక్ష్మీప్రసన్న, సుధారాణి, ఏఎన్ఎం గజలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త శరత్, ఎంఎల్‌హెచ్‌పీలు, హెచ్‌ఎలు, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాత్రలు పంపిణీలో.. మున్సిపల్ చైర్ పర్సన్



మాత్రలు పంపిణీ చేస్తున్న చైర్ పర్సన్ ఖాలేదా నసీమ్

తెనాలిఅర్బన్: అల్బెండజోల్ మాత్రలను ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేసుకోవడం వల్ల రక్తహీనతను నియంత్రించవచ్చని తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని పలు మున్సిపల్ పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలకు గైరుహాజరైన వారికి ఈ నెల 18నుంచి మాత్రలు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల, డాక్టర్ కృష్ణజ్యోతి, హెచ్‌ఎంలు కె.రాజారెడ్డి, అంబారీషుడు, శ్రీనివాసరావు, లండన్‌కు చెందిన బియాట్రీస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షయ బాధితులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



కిట్లు పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఆర్ఎం ప్రసాద్

తెనాలి: భారతీయ స్టేట్ బ్యాంక్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్)లో భాగంగా మంగళవారం 400 మంది క్షయ బాధితులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. చెంచుపేటలోని టీబీ సెంటర్‌లోని రాగులు, కందిపప్పు వగైరాలతో కూడా ఆహార పదార్థాలను అందజేశారు. బ్యాంక్ రీజినల్ మేనేజర్ ఎస్ఎల్‌కే ఎంవీ ప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటైన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ హాజరయ్యారు. ఎస్‌బీఐ కేవలం బ్యాంక్ కార్యకలాపాలకే పరిమితం కాకుండా సేవలను అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. ఎస్‌బీఐ ప్రాంతీయ అధికారులను అభినందించారు. రీజినల్ మేనేజరు ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పౌష్టికాహార కిట్ల పంపిణీ జరుగుతోందని చెప్పారు. డాక్టర్ లక్ష్మణ్‌నాయక్ స్వాగతం పలుకగా.. డాక్టర్ జీవనలత, హెచ్‌ఆర్ మేనేజరు వీవీఆర్ పవన్ కుమార్, టీబీ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు. టీబీ సెంటర్ నిర్వాహకులు ఆర్ఎంను ఘనంగా సత్కరించారు.

పంట అవశేషాల దహనం.. దిగుబడిపై ప్రభావం

ప్రకృతి వ్యవసాయం
జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి



రైతులకు వివరిస్తున్న జిల్లా పీఎం రాజకుమారి

కొల్లిపర: రైతులు రబీ సాగు అనంతరం పంటల అవశేషాలు పొలంలోనే కాల్చడంతో భూమిలోని పొరల్లోని సూక్ష్మజీవులు నశిస్తాయని ఆ ప్రభావం పంట దిగుబడులపై పడుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి తెలిపారు. మంగళవారం స్థానిక రైతు భరోసా-2 కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం, పొలం బడిపై రైతులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు రసాయనిక వ్యవసాయం నుంచి ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి యాంకర్ సతీష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పిల్లల వివాదం.. తండ్రికి ప్రాణ సంకటం

కత్తితో దాడి..
ఒక యువకుడి తండ్రి మృతి



మృతి చెందిన మత్తే రవి (ఫైల్)

చెముడుబాడు(కొల్లిపర): ఇద్దరు యువకుల మధ్య రేగిన వివాదం వారి తండ్రులకు ప్రాణ సంకటంగా మారింది. పిల్లల గొడవ తెలిసి తండ్రుల పద్ద ఘర్షణలో ఒకరు ప్రాణం విడిచారు. పోలీసులు వివరాల మేరకు.. మండలంలోని చెముడుపాడు గ్రామంలో మంగళవారం రాత్రి మత్తేరవి, కురంగటి కోటేశ్వరరావు పిల్లల మధ్య స్వల్ప వివాదం జరిగింది. అనంతరం ఇద్దరూ ఇళ్లకెళ్లి.. తమ తండ్రులకు చెప్పడంతో.. అది కాస్త వారి మధ్య ఘర్షణకు దారితీసింది. అంతకుముందు వారి మధ్య స్థల వివాదం ఇందుకు ఆజ్యం పోయడంతో.. అది ముదిరి కత్తులతో దాడి వరకు వెళ్లింది. ఆవేశంతో ఇద్దరు ఒకరిపై ఒకరు దాడికి దిగారు. మత్తెరవి(45)పై కోటేశ్వరరావు కత్తితో దాడిచేయటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతనిని కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించారు. మంగళవారం ఉదయం చికిత్స పొందుతూ.. రవి మృతి చెందాడని తెలిపారు. సమాచారం అందడంతో.. ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. దాడికి ఉపయోగించిన కత్తి స్వాధీనం చేసుకొని మృతుడి భార్య రాధ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెనాలి రూరల్ సీఐ కె.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి



అంబేడ్కర్ విగ్రహం వద్ద వాల్‌పోస్టర్‌ల ఆవిష్కరణ

తెనాలిఅర్బన్: కొల్లిపరలో ఈ నెల 19న జరిగే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ సభలో వేలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక వ్యవస్థాపకుడు అక్కిదాసు కిరణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు యాతాటి అనిల్, షేక్ దుబాయ్‌బాబు కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఐక్యవేదిక, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వెల్ఫేర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మంగళవారం సాయంత్రం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కాంస్య విగ్రహావిష్కరణకు సంబంధించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్ని వర్గాలకు చెందిన వాడని, ఆయన ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యవేదిక పట్టణ, మండల అధ్యక్షుడు జూపూడి వంశీ, కుర్రా యశ్వంత్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు కొడాలి క్రాంతి, మైలా హరి, కోలా వాసు, మల్లిబోయిన రాము, కుర్రా శ్రీను, కౌన్సిలర్ మొగల్ అహ్మద్ బేగ్, ఈద్గా ప్రెసిడెంట్ గౌస్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ రఫీ, వైఎస్సార్ సీపీ నాయకులు టెక్స్ బాల, నల్లగండ్ల రవిచంద్ర, ఉన్నవ సల్మాన్, అభిజిత్, శ్యామ్, ఖదీర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

రేపల్లె: రైతులకు వ్యవసాయ అధికారులు నిరంతరం అందుబాటులో ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ సత్తార్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం వ్యవసాయశాఖ అధికారులతో సాధారణ సమావేశం నిర్వహించారు. మండలంలో ఈకేవైసీ చేయించుకోని రైతులను గుర్తించి త్వరితగతిన నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలన్నారు. డాక్టర్ వైఎస్సార్ యంత్ర సేవా పరికరాలలో భాగంగా ఐదుగురు సభ్యులను గ్రూపులుగా ఏర్పాటు చేసి, వారికి కావాల్సిన ట్రాక్టర్‌లు, రొటావేటర్‌లు, ఆయిల్ ఇంజన్లు, తైవాన్ స్ప్రేయర్‌లు ఇప్పించాల్సిందిగా సూచించారు. రబీ సీజన్‌కు సంబంధించి పంట నమోదు వివరాలు రైతు భరోసా కేంద్రాల్లో ఉంచి రైతులకు తెలియజేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి విజయ్‌బాబు, ఏఈవోలు ప్రభాకరరావు, ఎ.పావని, వీఏఏలు, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

విద్యలో విప్లవాత్మక మార్పులు



మాట్లాడుతున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: విద్యలో విప్లవాత్మక మార్పులు రాష్ట్ర ప్రభుత్వం తెస్తోందని తెనాలి ఎంఈఓ మేకల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కొత్తపేటలోని తాలూకా హైస్కూల్‌లో మంగళవారం ఉపాధ్యాయ వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ విద్య విధానం 2020ను అనుసరించి, నిపుణ్ భారత్ సూచనలతో ప్రతి విద్యార్థికి విద్యాబోధన చేస్తున్నట్లు చెప్పారు. సరళమైన విద్య విధానాన్ని అనుసరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం బోయపాలెంలోని డైట్ కళాశాల సీనియర్ లెక్చరర్ డాక్టర్ ఎం.సౌజన్య మాట్లాడారు. నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతులు జరుగుతాయని చెప్పారు. సమావేశంలో డైట్ కళాశాల లెక్చరర్ పి.శ్రీనివాస్, రాష్ట్ర రీసోర్స్ పర్సన్ ఎస్ఎస్.శ్రీనివాస్, పి.మురళీకృష్ణ, కె.రాంబాబు, తెనాలి డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రహిత తెనాలి లక్ష్యం

వైద్యశిబిరంలో
చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్



వైద్యశిబిరంలో ఖలేదా నసీమ్, డాక్టర్ శారద, కౌన్సిలర్లు

తెనాలి: మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలి.. కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 25వ వార్డు పినపాడులోని కమ్యూనిటీ హాలులో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రోత్సాహంతో, మున్సిపాలిటీ సహకారంతో పట్టణానికి చెందిన స్వచ్ఛంద సేవా సంస్థ శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో కొన్ని నెలలుగా ఈ వైద్య శిబిరాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో 21, 22, 23, 24, 25, 26 వార్డుల పరిధిలోని మహిళలకు ఏర్పాటైన వైద్యశిబిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వార్డు కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, ఇస్తాయిల్, వెంకటేశ్వరరావు, ఇతర కౌన్సిలర్లు పాల్గొన్నారు. డాక్టర్ శారద ఆధ్వర్యంలో మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను ముందుగానే కనుగొనే పాప్‌స్మియర్ పరీక్ష, రొమ్ము పరీక్షలు చేశారు. షుగరు, బీపీ, హెమోగ్లోబిన్ శాతం పరీక్షలు నిర్వహించారు. అదే సందర్భంగా డాక్టర్ శారద మహిళలకు క్యాన్సర్ నిరోధానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఎలాంటి ఆహారాన్ని స్వీకరించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మహిళల్లో క్యాన్సర్ రహిత తెనాలి లక్ష్యాన్ని చేరుకునేలా కృషి జరుగుతోందని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ చెప్పారు. ఇందుకోసం డాక్టర్ శారద, ఆమె బృందం చేస్తున్న కృషి నిరుపమానం అన్నారు.

సాంఘిక నాటక కళాకారుడు వెంకటరావుకు సన్మానం



వెంకటరావును సన్మానిస్తున్న నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు

తెనాలిఅర్బన్: నందమూరి తారకరామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పెమ్మసాని థియేటర్‌లో మంగళవారం గుండమ్మకథ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం పాతాళభైరవి చిత్రాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం సాంఘిక నాటక కళాకారుడు పెరుగు వెంకటరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సోమవరపు నాగేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, పెరుగు రమాదేవి, పెమ్మసాని పోతురాజు, పీఎస్ఆర్ బ్రహ్మాచార్యులు, యల్.కాంతారావు, దేవరపల్లి భవానీ, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, కాకుమాను ఉపేంద్ర, ముళ్ళపూడి వెంకట్, కోడూరి జగదీష్, పరుచూరి వెంకటేశ్వరరావు, నల్లూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొలంలో పంటల అవశేషాలు తగలబెట్టొద్దు

పొలంబడిలో డీపీఎం రాజకుమారి



పొలంబడిలో సూచనలిస్తున్న రాజకుమారి

తెనాలి: రబీ పంటలు చేతికొచ్చాక, చేలల్లో పంట అవశేషాలను రైతులు తగులబెట్టొద్దని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు రాజకుమారి అన్నారు. పంట అవశేషాలను చేలో ఆచ్ఛాదనగా వాడాలని, పంట కోతల అనంతరం భూమిని ఖాళీగా వదిలేయకుండా 30 రకాల విత్తనాలను చల్లుకోవాలని సూచించారు. కొల్లిపరలోని రైతు భరోసా కేంద్రం-2లో మంగళవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి పొలం బడి, సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజకుమారి మాట్లాడుతూ.. ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో 30 రకాల విత్తనాలను చల్లుకోవటం వల్ల పంటల దిగుబడి పెరుగుతుందన్నారు. ఫలితంగా అదనపు ఆదాయం లభిస్తుందని, భూమిలో జీవవైవిధ్యం పెరిగి, సూక్ష్మజీవులు, వానపాములు వృద్ధి చెందుతాయని తెలిపారు. దీనివల్ల రసాయన అవశేషాలు లేని ఆహార పదార్థాలను రైతులు సొంతానికి వాడుకుంటూ సమాజానికి అందించే అవకాశం ఉంటుందని వివరించారు. తెనాలి యాంకర్ సతీష్, డివిజన్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న బస్సు

ఐదుగురికి గాయాలు



గాయపడిన వెంకటేశ్వరమ్మ



ఘటనా స్థలంలో దెబ్బతిన్న ఆటో..

రేపల్లె రూరల్: ఆటోని ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఐదుగురు గాయపడిన ఘటన కారుమూరు గ్రామ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్ఐ అబ్దుల్ రజాక్ వివరాల మేరకు.. రేపల్లె నుంచి తెనాలి వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. పల్లెకూన నుంచి రేపల్లె వైపునకు కూలీలతో వస్తున్న ఆటోను కారుమూరు సమీపంలో ఢీకొంది. ఈ ప్రమాదంలో పల్లెకూనకు చెందిన ఆటో డ్రైవర్ కె.సుందరయ్యతో పాటు అదే గ్రామానికి చెందిన మురాల సరస్వతి, పరిశా వెంకటేశ్వరమ్మ, పరిశా కుమారి, రెడ్డంకమ్మలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా.. క్షతగాత్రులను రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు, ఇరువురిని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిశా కుమారిని, మురాల సరస్వతిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు వైద్యశాలకు తరలించారు. పరిశా వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు రూ.5,19,500ల ఉపకార వేతనాలు



ఉపకార వేతనాలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

పిట్టలవానిపాలెం: ఖాజీపాలెంలోని డిగ్రీ, డాక్టర్ డీఎస్ రాజు జూనియర్ కళాశాలల్లోని ప్రతిభగల పేద విద్యార్థులకు దక్కన్ ఫైన్ కెమికల్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రాజు రూ.5,19,500ల ఉపకార వేతనాలు అందజేశారు. మొత్తం 62 డిగ్రీ, ఇద్దరు ఇంటర్మీడియట్, 30 పీజీ విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శివప్రసాద్ తెలిపారు. మంగళవారం జరిగిన పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆచార్య సత్యనారాయణరాజు పాల్గొన్నారు. కళాశాల పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు, ఉపాధ్యక్షుడు ఎం.శివరామరాజు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మంతెన శ్రీనివాసకుమార్, జాయింట్ సెక్రెటరీ మంతెన కృష్ణంరాజు, బాపట్ల మాజీ ఎమ్మెల్యే మంతెన అనంతవర్మరాజు, పీవీ పాలెం ఆంధ్రబ్యాంకు మేనేజర్ వెంకటరావు తదితరులు ఉన్నారు.

నేడు 4వ వార్డులో ‘గడప గడపకు’

తెనాలిఅర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పట్టణంలోని 4వ వార్డు బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి స్కూల్ సమీపం నుంచి బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ నేతృత్వంలో జరిగే కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రభుత్వ అధికారులు, సచివాలయ ఉద్యోగులు,వాలంటీర్లు పాల్గొనాలని కోరారు.

నేడు 18వ వార్డులో ఆధార్ ప్రత్యేక క్యాంప్

ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను 18వ వార్డు సచివాలయంలో బుధవారం నిర్వహించనున్నట్లు సచివాలయ అడ్మిన్ కె.లక్ష్మీ తనూజ తెలిపారు. ఫోన్ నంబర్ అనుసంధానం, వేలిముద్రలు, ఐరిష్, ఫొటో అప్డేట్, పేరు, పుట్టిన తేదీల్లో మార్పువంటి సేవలందించనున్నట్లు తెలిపారు.

ఇసుక డంప్ గుర్తింపు

తెనాలిరూరల్: టన్నుల కొద్ది నిల్వ చేసిన ఇసుకను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. కొల్లిపర మండలం మున్నంగి గ్రామంలో 300 టన్నుల ఇసుల నిల్వ ఉందన్న సమాచారంతో తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది మంగళవారం తనిఖీలు చేపట్టారు. గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి ఇసుకను నిల్వ చేసినట్టు గుర్తించి పోలీసులకు కేసు అప్పగించారు.

నెహ్రూ నికేతన్‌లో క్రీడాదినోత్సవం..

తెనాలి: క్రీడల్లో నైపుణ్యాన్ని సాధించాలని వన్ టౌన్ సీఐ కె.చంద్రశేఖర్ సూచించారు. స్థానిక బోసు రోడ్డులోని నెహ్రూ నికేతన్ పాఠశాలలో మంగళవారం వార్షిక క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి అధ్యక్షత వహించారు. సీఐ చంద్రశేఖర్ క్రీడల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. వార్షిక క్రీడోత్సవంలో భాగంగా విద్యార్థుల పిరమిడ్ విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నృత్యరూపకాలనూ విద్యార్థులు ప్రదర్శించారు. పలు క్రీడల్లో విజేతలకు సీఐ చంద్రశేఖర్ చేతుల మీదుగ జ్ఞాపికలు, పతకాలను అందజేశారు.

రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానని రూ.15లక్షల టోకరా

రేపల్లె రూరల్: రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామని ఓ యువకుడి నుంచి లక్షల రూపాయలు వసూలు చేసిన ఇద్దరిలో.. ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ సీఐ విజయచంద్ర తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. రేపల్లె మండలం కారుమూరు గ్రామానికి చెందిన యర్రమోతు శివదుర్గా ప్రసాద్‌కు రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి 2021 అక్టోబర్ 16న పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన పంజర్ల సీతారాం, గొలుసూరి వీరకుమార్ రూ.15లక్షలు వసూలు చేశారని చెప్పారు. అప్పటి నుంచి వారు శివదుర్గా ప్రసాద్‌ను మభ్యపెడుతూ మాటలు దాటవేశారన్నారు. చివరికి తాను మోసపోయానని గ్రహించిన శివదుర్గాప్రసాద్ పోలీసులను ఆశ్రయించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా నిందితులలో ఒకరైన పంజర్ల సీతారామ్‌ను హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నామని, రేపల్లె కోర్టులో హాజరుపరిచామని చెప్పారు. మరో నిందితుడు వీరకుమార్ పరారీలో ఉన్నాడన్నారు. ఎవరైనా అపరిచత వ్యక్తులు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెబితే నమ్మొద్దని, అటువంటి వారి వివరాలను స్థానిక పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని చెప్పారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



క్రీడాకారులతో తైక్వాండో జిల్లా అసోసియేషన్ సెక్రటరీ జగన్‌మోహన్‌రావు

రేపల్లె: విశాఖపట్నం యలమంచిలిలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 10 నుంచి నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనపరిచినట్లు గుంటూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ సెక్రటరీ కె.జగన్‌మోహనరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. పోటీలలో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఆరు పతాకాలు సాధించారని సెక్రటరీ తెలిపారు. కేజేవీ అరుణ(గుంటూరు) బంగారం, ఎస్‌కే షాహీనా(రేపల్లె) వెండి, ఆర్.లావణ్య(తెనాలి), ఎ.రీమాప్రశిల్లా(రేపల్లె), ఆర్.భువన్‌కుమార్(రేపల్లె), పి.ప్రణవ్ సాయిరాఘవ(రేపల్లె)లు కాంస్య పతాకాలను సాధించారన్నారు. క్రీడాకారుల అభ్యున్నతికి కృషి చేసిన కోచ్‌లు సిహెచ్ రంగ, కె.అనూష, కె.హనుమాన్‌ను ఆయన అభినందించారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులు మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు.